
సాక్షి బాపట్ల

శనివారం : 29 : జూలై : 2023

I



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటి మట్టం శుక్రవారం 515.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,940, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



28 టీఎంసీలకు చేరిన పులిచింతల

అచ్చంపేట: ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరుతుండటంతో పులిచింతల నీటి నిల్వ శుక్రవారం సాయంత్రానికి 28.43 43 టీఎంసీలకు చేరింది.



శివసేవలో కశ్మీర్ న్యాయమూర్తి

అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామిని శుక్రవారం జమ్ము కశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తషిరబ్‌స్తాన్ దంపతులు దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

బాపట్లకు విచ్చేసిన ఇంతియాజ్



బాపట్ల: సీసీఎల్ ప్రత్యేక కార్యదర్శి, సెర్ప్ రాష్ట్ర సీఈవో ఇంతియాజ్ బాపట్ల జిల్లా కలెక్టరేట్‌ను శుక్రవారం సందర్శించారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, డీఆర్ఓ కె.లక్ష్మీశివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై కేసు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలో గురువారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై టీడీపీ అల్లరి మూకలు, మాజీ ఎమ్మెల్యే జీవీ అనుచరులు దాడి చేసిన నేపథ్యంలో పోలీసులు దాడికి బాధ్యులైన వారిపై కేసు నమోదు చేశారు. దాడిలో ఎమ్మెల్యే గన్‌మెన్ షేక్ నబి సాహెబ్‌కు గాయాలయ్యాయి. గన్‌మెన్ ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులు జగ్గారావు, పి.వి.సురేష్, గడిపూడి విశ్వనాథం, పఠాన్ ఆయూబ్‌ఖాన్, తూమాటి కాశీ, నర్రా కిషోర్, వీరగంధం ప్రశాంత్, మీసాల మురళీ కృష్ణతో పాటు మరో 200 మంది కార్యకర్తలపై 147,148,341,353,332,324, ఆర్/డబ్లూ 149 ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతిభా బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్–2024కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి బి.మనోరంజని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడలు, సామాజిక సేవ, సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం, కళలు, కొత్త ఆవిష్కరణల రూపకల్పనలో ప్రతిభ చూపిన బాలలు (ఆగస్టు 31 నాటికి 18 సంవత్సరాలు నిండని వారు) బాల పురస్కార్ కోసం ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నామినేషన్లు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగర పాలక సంస్థ స్థాయి సంఘ (స్టాండింగ్ కమిటీ) ఎన్నికకు ఐదుగురు నామినేషన్లు వేశారని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఈ నెల 22న నోటిఫికేషన్ ఇచ్చామని వెల్లడించారు. ఆగస్టు 11న ఎన్నిక జరగనుందని, ఈ నెల 27 నుంచి ఆగస్టు 1 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆగస్టు 2న నామినేషన్ల పరిశీలన నిర్వహించి, అర్హత కలిగిన వారి లిస్టును అదేరోజు పబ్లిష్ చేస్తామని వెల్లడించారు. ఆగస్టు 7 వరకు నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవడానికి గడువు ఉందని, అదే రోజు ఫైనల్ లిస్టు పబ్లిష్ చేస్తారని పేర్కొన్నారు. ఆగస్టు 11న నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, అదే రోజు 3 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తామని వివరించారు.

నర్సింగ్ ట్యూటర్స్‌గా ప్రమోషన్లు

గుంటూరు మెడికల్ : గుంటూరు నర్సింగ్ కళాశాలలో ఖాళీగా ఉన్న నర్సింగ్ ట్యూటర్స్ గ్రేడ్–2 పోస్టులను శుక్రవారం ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేశారు. గుంటూరు నర్సింగ్ కళాశాలలో ఏడు పోస్టులను, ఒంగోలు నర్సింగ్ కళాశాలలో ఒక పోస్టును గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ కౌన్సెలింగ్ నిర్వహించి స్టాఫ్ నర్సులుగా పని చేస్తూ బీఎస్సీ నర్సింగ్ అర్హత ఉన్నవారితో భర్తీ చేశారు. సకాలంలో ప్రమోషన్లు కల్పించినందుకు ఆర్డీకి నర్సింగ్ యూనియన్ నేతలు బెల్లంకొండ శైలజ, వెల్లంపల్లి పద్మజ కృతజ్ఞతలు తెలిపారు.

యార్డులో 24,489 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,649 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 24,489 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.11 వేల నుంచి 26 వేల వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10 వేల నుంచి రూ.22 వేల వరకు పలికింది.

బాబూ.. కోతలకు జవాబు ఏదీ!

- కొరిశపాడు ఎత్తిపోతలను వదిలేశారు
- ఎర్రం చినపోలిరెడ్డి పథకం నిర్వీర్యం
- తమ్మ'వరం' కాకుండా చేశారు..
- అద్దంకి తాగునీటిని అడ్డుకున్నారు
- టిడ్కో ఇళ్లను మధ్యలో వదిలేశారు
- పేదల ఇంటిపట్టాలకు ఎగనామం
- ఇవీ నాన్న ఘన కార్యాలు లోకేశ్

చంద్రబాబు పాలన స్తబ్దతకి, అహంకారానికి, అసమర్థతకి అద్దం పట్టింది.. అవ్వాతాతల నుంచి రైతన్నల వరకు.. నిరుద్యోగుల నుంచి ఉద్యోగుల వరకు.. యువత నుంచి మహిళల వరకు అడుగడుగునా అవమానాలు పడ్డారు.. పేదలను మనిషిలా చూసిన పాపాన పోలేదు.. మనిషికీ మృగాళ్లకు సరిహద్దులు చెరిపేసిన కాలం అది.. శిక్ష నుంచి తప్పించుకోలేని ఎన్నో తప్పులు చేసి.. ఈపాటికి అంతా మరిచిపోయి ఉంటారని.. పగటికి కొత్త రంగు వేస్తూ ఎండుటాకులమీద చప్పుడు కాకుండా నడవాలనుకుంటున్నారు.. చంద్రబాబు 'కోత'లు చేసిన గాయాల నుంచి పేదలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న చేతినందుకుని ఊపిరి పీల్చుకుంటున్నారు.. మళ్లీ బాబు తనయుడు లోకేశ్, యువగళం పేరుతో బయలుదేరింది నయవంచన దళం..



చంద్రబాబు హయాంలో అర్ధాంతరంగా వదిలేసిన రిజర్వాయర్



తమ్మవరంలో గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న పంప్‌హౌస్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో జిల్లా అభివృద్ధి పరుగులు పెడుతోంది. గత టీడీపీ హయాంలో పాలన అస్తవ్యస్తంగా సాగింది. జిల్లా పరిధిలో అలవికాని హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్కటీ అమలు చేసిన పాపాన పోలేదు. చంద్రబాబు తనయుడు నారా లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్రగా వస్తుండడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. జిల్లా పరిధిలో ఉన్న గ్రానైట్ పరిశ్రమను ప్రోత్సహించకపోగా దోచుకునేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. చేనేత కార్మికులు అగచాట్లను పట్టించుకున్న దాఖలాలు లేవు. కార్మికులు వృత్తిని వదులుకునే పరిస్థితి సృష్టించారు. చిన్న ముంబాయిగా పేరున్న చీరాలకు ఒక్క రూపాయి విదల్చాలేదు. పర్చూరు, అద్దంకి, చీరాల ప్రాంతాల్లో వ్యవసాయానికి ఎత్తిపోతల పథకాలే ఆధారం. మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక పథకాలకు నిధులు మంజూరు చేసినా బాబు వాటిని అడ్డుకోవడంతో పథకాలు బిక్కుబిక్కుమంటున్నాయి. అన్ని రంగాలను అభివృద్ధి చేశాం.. చేస్తామంటూ డంబికాలు పోతున్న లోకేశ్, బాబు చేసిన గత పాపాలకు జవాబు ఇవ్వాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత గ్రామ సచివాలయాల ద్వారా అర్హులందరికి అందుతున్న సేవలతో పాటు అభివృద్ధిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నారా లోకేశ్ యువగళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్ర శనివారం కొరిశపాడు మండలంలోకి ప్రవేశించనుంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఇచ్చిన హామీల చిట్టా చూడు చినబాబూ..

జిల్లా సమస్యలను పట్టించుకోని బాబు

అధికారంలో ఉన్నప్పుడు జిల్లా వాసులకు ఇచ్చిన హామీలసంగతి చంద్రబాబు పట్టించుకోలేదు. ఎన్నికల ముందుచెప్పిన రైతు,డ్వాక్రా రుణమాఫీలకు బాబు ఎగనామం పెట్టాడు. అప్పటివరకూ ఉన్న సంక్షేమ పథకాల్లో కోత పెట్టారు. అభివృద్ధి పనులను విస్మరించారు. ఆయన పాలనలో అవినీతి అక్రమాలకు అడ్డులేకుండా పోయింది. నీరు– చెట్టు పేరుతో ప్రజాధనాన్ని టీడీపీ కార్యకర్తలకు పంచిపెట్టాడు.

'ఉత్తి'పోతలుగా కొరిశపాడు

కొరిశపాడు ఎత్తిపోతల పథకాన్ని మూలనపెట్టారు. పథకం కింద తమ్మవరం పంపుహౌస్, బొల్లవరప్పాడు రిజర్వాయర్ నిర్మించాల్సి ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో రూ.177 కోట్లు కేటాయించారు. ఆయన మరణంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. తరువాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. పనులు పూర్తి అయివుంటే 20 వేల ఎకరాలకు సాగునీరు అందేది. ఎర్రంచినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకానిది ఇదే పరిస్థితి. తమ్మవరం–2 ఎత్తిపోతల పథకాన్ని మొదలు పెట్టినా టీడీపీ ఆ ప్రాజెక్టును పూర్తి చేయలేదు. దీంతో ఐదు వేల ఎకరాల ఆయకట్టుకు నీరందని పరిస్థితి.

భవ'నాశినం' చేశారు..

అద్దంకి నియోజకవర్గానికి సంబంధించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా మంజూరు చేసిన పలు ప్రాజెక్టులను చంద్రబాబు విస్మరించారు. భవనాశి రిజర్వాయర్ నిర్మాణానికి వైఎస్సార్ రూ.27 కోట్ల నిధులు కేటాయించారు. ఆయన అకాల మరణంతో ప్రాజెక్టు పనులు ఆగిపోయాయి. ఆ తరువాత అధికారం చేపట్టిన బాబు పనులు పట్టించుకోలేదు. పనులు సకాలంలో పూర్తి అయి ఉంటే ఐదు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉండేది.

పట్టణాభివృద్ధికి నిధులిస్తే ఒట్టు..

అద్దంకి పట్టణ అభివృద్ధిని అసలు పట్టించుకోలేదు. టిడ్కో ఇళ్లు ఇస్తున్నామంటూ ఆర్భాటంగా మొదలు పెట్టి అర్ధాంతరంగా వదిలేశారు. మేదరమెట్ల– నార్కెట్‌పల్లి రహదారి కొరవ పనులు పూర్తి చేయలేక పోయారు. అద్దంకి పట్టణానికి నీరు అందిస్తామని చెప్పి ఆ పనులు జోలికెళ్లలేదు.

ఫిషింగ్ హార్బర్‌ను అడ్డుకునేందుకు..

రేపల్లె నియోజకవర్గంలో మత్స్యకారుల ప్రయోజనార్థం ఫిషింగ్‌హార్బర్ నియమించాలన్నది అక్కడి వారి డిమాండ్. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫిషింగ్ హార్బర్‌కు అంకురార్పణ చేయగా చంద్రబాబు వచ్చాక దానిని పక్కన బెట్టారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే రూ.451 కోట్లతో ఫిషింగ్ హార్బర్ పనులు మొదలు పెట్టారు.



నిజాంపట్నంలో ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న హార్బర్ పనులు

చి'వరి'కి మొండిచేయి

పర్చూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న 25 ఎత్తిపోతల పథకాలకు నిధులిచ్చి అభివృద్ధి చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చినా అది నెరవేర్చలేదు. దీంతో పాటు పర్చూరు వాగు అభివృద్ధిని గాలికి వదిలారు. దీంతో సాగర్ చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడ్డారు.

చేనేత పార్కు ఊసేలేదు..

చీరాలలో చేనేతలు అధికంగా ఉన్నారు. చంద్రబాబు చేనేత పార్కు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కాని అడుగు పడలేదు. రూ.1.50 లక్షలతో ఇల్లు, మగ్గంషెడ్డు ఇస్తామని చెప్పి మోసం చేశాడు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చేనేతల కోసం కేటాయించిన పార్కు స్థలం అభివృద్ధిని అప్పటి బాబు ప్రభుత్వం అడ్డుకుంది. ఉచిత ఆరోగ్య బీమా కల్పిస్తామని చెప్పి అప్పటికే అమలులో ఉన్న పథకాలను రద్దు చేసిన ఘనత బాబుదే.

ముంపు సమస్యకు..

కందులఓబుల్‌రెడ్డి రిజర్వాయర్ పరిధిలో అద్దంకి, కొరిశపాడు మండలాల్లో 12 ముంపు గ్రామాల్లో సమస్యలను గాలికి వదిలేశారు. స్థానిక ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా గెలిచి అభివృద్ధి కోసమే టీడీపీలో చేరినట్లు చెప్పినా ఫలితం లేకుండా పోయింది.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

- కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి
- ఈ సందేశం ప్రతి గుమ్మానికి చేరాలి

బాపట్ల: పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా కోరారు. జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా బాపట్ల మండలం వెదుళ్లపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఏఎస్పీ పి.మహేష్‌తో కలసి మొక్కలు నాటారు. జిల్లా అధికారులంతా మొక్కలను వైద్యశాల ఆవరణలో నాటారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోనూ జిల్లా కలెక్టరు కుటుంబ సమేతంగా వచ్చి మొక్కలు నాటారు. తదుపరి కూరగాయల విత్తనాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు.

'హరిత బాపట్ల'కు శ్రీకారం

'హరిత బాపట్ల' జిల్లాగా రూపురేఖలు మార్చడం కోసం డ్వామా ఆధ్వర్యంలో రెండు లక్షల మొక్కలు ఒకేసారి జిల్లాలో నాటుతున్నామని కలెక్టరు పి.రంజిత్‌బాషా వెల్లడించారు. ఒక మొక్కకు ప్రాణం పోస్తే జీవితకాలం మనకు ఉపయోగపడుతుందని చెప్పారు. మనం వినియోగించే ప్రతి వస్తువు మొక్కల నుంచి వస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు. కాలుష్యాన్ని నియంత్రించడానికి ఉద్యమంలా మొక్కలు నాటుతున్నామని వివరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ స్థలాలన్నింటిలో మొక్కలు నాటుతున్నామని పేర్కొన్నారు. మొక్కలు మానవాళికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. నాటిన ప్రతి మొక్కను జియో ట్యాగింగ్ చేస్తున్నామని తెలిపారు. బాపట్ల జిల్లాను పచ్చతోరణంగా చేయడం కోసం భారీ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. డి.ఆర్.డి.ఎ. ద్వారా జిల్లా వ్యాప్తంగా 75 వేల కూరగాయల విత్తనాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. మొక్కలు నాటిన తదుపరి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు.



వెదుళ్లపల్లి పీహెచ్‌సీలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి

మొక్కలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టరు సిహెచ్.శ్రీధర్, డీఆర్ఓ కె.లక్ష్మీశివజ్యోతి, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, డ్వామా పీడీ వై.శంకర్ నాయక్, డీఆర్‌డీఏ పీడీ బి.అర్జున్‌రావు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎస్.విజయమ్మ పాల్గొన్నారు.

9 నుంచి నా మట్టి– నా దేశం..

జిల్లాలో నామట్టి– నాదేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నా మట్టి– నా దేశం కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పంచాయతీల్లో 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు, మున్సిపాలిటీల్లో 16 నుంచి 20వ తేదీ వరకు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివ జ్యోతి, సి.పి.ఒ. భరత్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు పాల్గొన్నారు.

ఓటర్ల నిష్పత్తిని పరిశీలిస్తున్నాం..

జనాభా సంఖ్య ఆధారంగా స్త్రీ, పురుషుల ఓటర్ల నిష్పత్తిని పరిశీలిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై విజయవాడ నుంచి ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితాలో లింగ భేదాలు పరిగణనలోకి తీసుకుని సర్వే చేస్తున్నామని కలెక్టర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో జరుగుతున్న ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియ, సర్వేపై కమిషనర్‌కు వివరించారు. ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ కె.లక్ష్మీశివజ్యోతి, ఎన్నికల పర్యవేక్షకులు కృష్ణకాంత్, పాల్గొన్నారు.

ఆహారం.. తయార్!



సిద్ధం చేస్తున్న ఆహా క్యాంటీన్లు

- జిల్లాలో నాలుగు క్యాంటీన్లు
- జన సంచారం ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు
- ప్రభుత్వ ఆస్పత్రులు, బస్టాండ్ తొలి ప్రాధాన్యం
- మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి

బాపట్ల అర్బన్: 'ఆహా'రం పేరుతో ప్రభుత్వం క్యాంటిన్లను ఏర్పాటు చేయనుంది. అందుకు కసరత్తు చేస్తోంది. జన సంచారం ఉన్న ప్రాంతాల్లో తక్కువ రేటుకు రుచికరమైన భోజనాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో టీఎల్‌ఎఫ్‌లో ఉన్న స్వయం శక్తి సంఘాలకు బాధ్యతలు అప్పగించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. భోజనం అందించేలా కార్యాచరణ చేశారు.

ఏమిటీ ఆహా... క్యాంటీన్లు?

మున్సిపాలిటీలోని స్వయం శక్తి సంఘాల మహిళలకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో డ్వాక్రా బజార్లు, కుట్టు మిషన్ శిక్షణ, కంప్యూటర్ శిక్షణ శుద్ధముక్కల తయారీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి ఉపాధి చూపిస్తున్నారు. అందులో భాగంగా ఆహ్వా క్యాంటీన్లు ఏర్పాటు చేసి అటు మహిళలకు ఉపాధి ఇటు పట్టణ పేదలకు తక్కువ ధరకు రుచికరమైన భోజనాలను అందించనున్నారు. ఇందుకు మెప్మా వారు ప్రథమ దశలో 13 వేలను అందించేందుకు ప్రోత్సహిస్తున్నారు.

నాలుగు క్యాంటీన్లు..

జిల్లాలో నాలుగు ఆహా క్యాంటీన్లు ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. జిల్లాలోని బాపట్ల, రేపల్లె, చీరాల, అద్దంకి మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.


స్థలం చూపించి టెంట్ ఇస్తాం



ఆహా క్యాంటీన్లను స్వయం శక్తి సంఘాలకు చెందిన మహిళలే ముందుకు వచ్చి నిర్వహణ బాధ్యతలు చేపట్టవచ్చు. వాటితో వారు ఉపాధి పొందవచ్చు. అనుమతులు స్థలం చూపించడం టెంట్లు వంటివి సమకూర్చడం చేస్తుంది. అందుకు తగిన రుసుం వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించుకోవాలి, మొదటగా రూ.13,000 ప్రోత్సాహంగా అందిస్తారు. అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తాం.

– పి.వెంకట నారాయణ, మెప్మా పీడీ, బాపట్ల జిల్లా

ఔత్సాహికులకు ఆహ్వానం



మున్సిపాలిటీలో ఆసక్తి ఉన్న టీఎల్‌ఎఫ్‌లకు ఈ అవకాశం కల్పిస్తాం. స్వయం శక్తి సంఘాల్లో రుణాలు పొందుతున్న వారు అయితే ఎంతో మేలు. దీంతో మహిళలు ఉపాధి పొందడంతో పాటు నిరుపేదలకు రుచికరమైన భోజనాలు అందుతాయి. ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అనారోగ్యంతో బాధపడుతున్న వారు పరామర్శించడానికి వచ్చిన వారికి ఉపయోగపడతాయి. బస్టాండ్ వద్ద ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది.

–ఎ.భాను ప్రతాప్, కమిషనర్, బాపట్ల మున్సిపాలిటీ

వంద రోజులు పని కల్పించాలి

డ్వామా పీడీ శంకర్‌నాయక్

వేటపాలెం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు వంద రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ శంకర్‌నాయక్ ఆదేశించారు. స్థానిక మండలం పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. తొలుత సోషల్ ఆడిట్ సిబ్బంది మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలోని వివిధ పనుల నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి వరకు 1,281 పనులకు రూ.6.69 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందులో కూలీలకు రూ.4.87 కోట్లు, మెటీరియల్ కింద రూ.1.82 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. కొన్ని గ్రామాల్లో గతేడాది మొక్కలు నాటినట్లు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో సుస్థిర ఆస్తులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందులో భాగంగా సిమెంట్ రోడ్లు, భవనాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మొక్కలు చనిపోయినట్లు ఆడిట్ సిబ్బంది గుర్తించారని చెప్పారు. వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు. పనులకు వచ్చిన కూలీలకు పని ప్రదేశంలోనే హాజరు వేయాల్సి ఉంది, అయితే చాలా మంది కూలీలు మస్టర్ పుస్తకంలో సంతకం చేయకుండా వెళ్లినట్లు గుర్తించామన్నారు. మస్టర్ రిజిస్టర్‌లో కొట్టివేతలు, దిద్దివేతలు ఉండకూడదని సిబ్బందికి సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సరాసరి వేతనం రూ.272 కాగా మన జిల్లాలో రూ.244 ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇంకా రూ.250 వరకు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారని చెప్పారు. ఇలా ప్రతి కుటుంబానికి పని దినాలు ఇవ్వాలని నిర్దేశించారు. కార్యక్రమంలో డీవీవీ శోభన్‌బాబు, ఏపీడీ ఎస్.రాజేష్, ఎంపీడీఓ కే నేతాజీ, ఏపీవో సుధారాణి పాల్గొన్నారు.



పీఆర్ డీఈని భవనిర్మాణాల వివరాలు అడిగి తెలుసుకుంటున్న పీడీ శంకర్‌నాయక్

ఫ్లెక్సీల కోసం రోడ్డు గుల్ల చేశారు...

'యువగళం కోసం' అత్యుత్సాహం

అద్దంకి రూరల్: యువగళం పాదయాత్రలో భాగంగా అద్దంకి నియోజకవర్గంలో శని, ఆదివారాల్లో నారా లోకేశ్ పర్యటించనున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి అద్దంకి పట్టణంలో స్వాగత ఫ్లెక్సీల ఏర్పాటుకు తమ్ముళ్లు రోడ్లను గుల్ల చేశారు. కటౌట్‌ల కోసం నామ్ హైవేపై ఇష్టానుసారంగా గుంతలు పెట్టారు. ఎప్పుడు రద్దీగా ఉండే బస్టాండ్ సెంటర్‌లో హైవేపై వాహనాలు తిరిగేందుకు అవకాశం లేకుండా ఇరుకుగా స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుకు అడ్డుగా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

పశుసంపద అభివృద్ధికి కృషి

బాపట్లటౌన్: పశు సంపద అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఎం.హనుమంతరావు తెలిపారు. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలకు మందులను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్క రైతు భరోసా కేంద్రం పరిధిలోని పశువులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కేంద్రానికి 108 రకాల మందులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పశువులకు సీజనల్ వ్యాపించే వ్యాధులకు సంబంధించిన మందులు, దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

వరదపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు: ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు వరదను వదులుతుండడంతో కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలకు వరద తాకిడి పెరిగింది. ఓలేరు పల్లెపాలెం, కాకులడొంక రేవు వద్ద పరిస్థితిని తహసీల్దార్ డి.వెంకటేశ్వరావు శుక్రవారం పరిశీలించారు. స్థానికులు రేవులోకి వెళ్ల వద్దని ఆదేశించారు. వరద ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా కృష్ణా నదీ పరివాహక లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, అగ్నిమాపక దళం అప్రమత్తంగా ఉన్నట్లు చెప్పారు. సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల రెవెన్యూ అధికారులకు తెలియ చేస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే టాం టాం ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని, ప్రజలు చప్టాలు, రేవులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. వ్యవసాయ పనుల నిమిత్తం నదిలోకి పశువులు, గొర్రెలు, మేకలు మేత నిమిత్తం తోలుకుని వెళ్లకుండా జాగ్రత్త పడాలని కోరారు. ఓలేరు పల్లెపాలెం, పెదలంక, పెసర్లంక, చింతమోటు గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలను అవసరం మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సర్వేయర్ బి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఆర్ఐ శివరామకృష్ణ, వీఆర్వోలు ఎం.జక్రయ్య ఉన్నారు.


భట్టిప్రోలు కాకులడొంక పుష్కర ఘాట్ వద్దకు చేరిన వరద నీరు

కరకట్టల పటిష్ఠతకు చర్యలు

కరకట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాలలో మరమ్మత్తులు నిర్వహించి ఇసుక బస్తాలు వేసేందుకు ఇప్పటికే సిద్ధం చేశారు. ఆర్‌సీ ఏఈలు కె.నాగేశ్వరనాయక్, ఎస్.సురేష్, సిబ్బంది ముందస్తు జాగ్రత్తగా కరకట్టకు గండ్లు పడే ప్రమాదం ఉన్న ప్రాంతాలను గుర్తించి పటిష్టం చేయడమే కాక ఇసుక మూటలను సిద్ధం చేశారు. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున రైతులు మోటార్లను ఊడదీసి సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కరణం బలరాం
- మహిళా మార్ట్ ప్రారంభం

చీరాల: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. చీరాల రూరల్ పరిధిలోని ఈపురుపాలెం వంతెన వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో మహిళ సంఘాలు తీసుకున్న రుణాలు నాలుగు విడతల్లో మాఫీ చేశారని గుర్తు చేశారు. మహిళా మార్ట్‌లో అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉంటాయని వివరించారు. నియోజకవర్గ ప్రజలు ఇటువంటి మార్ట్‌లను ఆదరించాలని కోరారు. నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా వస్తువులు అందించి వినియోగదారుల అభిమానాన్ని చూరగొనాలని మహిళా మార్ట్ నిర్వాహకులకు సూచించారు. రానున్న రోజుల్లో ప్రతి మండలంలో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జునరావు, ఆర్డీఓ సరోజినీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ మహిత, ఎంపీడీఓ కే నేతాజీ, తహసీల్దార్ ప్రభాకర్‌రావు, వెలుగు ఏపీఎం సుబ్బారావు పాల్గొన్నారు.


మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం

న్యాయవాది హత్యపై వీడని మిస్టరీ!

అద్దంకి: న్యాయవాది హత్యపై మిస్టరీ వీడలేదు. ప్రత్యర్థులు హత్యచేసి పొలంలో పూడ్చినట్లు చెబుతున్నా ఇంత వరకు గుర్తించలేదు. దీనిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు న్యాయవాది అదృశ్యంపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బల్లికురవ మండలంలోని కొణిదెన గ్రామానికి చెందిన రాయసం ఆదిశేషు విఠల్ బాబు 20 ఏళ్ల కిందట వెళ్లి న్యాయవాదిగా విజయవాడలో స్థిరపడ్డాడు. సొంత ఊరులో పూర్వీకులకు చెందిన పొలం ఉంది. పొలం విషయంలో అదే గ్రామానికి చెందిన ఒకరితో విభేదాలు రావడంతో కోర్టులో కేసు నడుస్తోంది. అద్దంకి కోర్టుకు ఈనెల 26వ తేదీ హాజరయ్యారు. అదే సమయంలో విభేదాలు ఉన్న వ్యక్తి కేసు విషయమై రాజీ చేసుకుందామని పిలిచినట్లు భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. ఆ తరువాత ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. ఆయన కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. చంపి పూడ్చి పెట్టినట్లు వచ్చిన సమాచారం మేరకు బొమ్మనంపాడు సమీపంలోని పొలాల్లోకి తీసుకుని వెళ్లారు. అక్కడ పూడ్చిపెట్టిన స్థలాన్ని గుర్తించినట్లు పోలీసు వర్గాలు చెప్పాయి. అయితే ఇంకా వెలికితీత కార్యక్రమం చేపట్టలేదు. పోలీసులు ఫోరెన్సిక్ నిపుణుల సాయం తీసుకుంటున్నట్లు చెప్పారు.

పన్ను నిర్దేశిత గడువులోగా చెల్లించాలి

బాపట్ల ఎంవీఐ రంగారావు

భట్టిప్రోలు: ట్రాన్స్‌పోర్టు వెహికల్ యజమానులు చెల్లించాల్సిన త్రైమాసిక పన్నును నిర్దేశిత సమయంలో చెల్లించాలని బాపట్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ డీటీవీ రంగారావు అన్నారు. భట్టిప్రోలులో శుక్రవారం ఏపీ ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన ఎండీయూ వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాటిని తనిఖీ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను అందజేశారు. ఇటీవల భట్టిప్రోలు విచ్చేసిన బాపట్ల జిల్లా డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయి ఆఫీసర్ ఈబీ విలియమ్స్, ఎండీయూ వాహనాల సరిగా ఫిట్‌నెస్ లేవని, వాహనాల డ్రైవింగ్‌లో ఆపరేటర్లు అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని గ్రహించి మోటార్ వెహికిల్ అధికారులతో మాట్లాడి ఈ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశారు.

నెలకే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్

ఎస్ఈ సత్యనారాయణ

అద్దంకి: వచ్చే నెల నుంచి దరఖాస్తు చేసిన నెల రోజులకే రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ తెలిపారు. ఆయన నెలవారీ సమీక్షలో భాగంగా పట్టణంలోని ఈఈ కార్యాలయానికి శుక్రవారం వచ్చారు. దీనిలో భాగంగా కార్యాలయ ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 2,200 మంది రైతులు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. డివిజన్ పరిధిలో 400 మంది ఉన్నారని, వీరికి వచ్చే నెల 15వ తేదీ లోపు కనెక్షన్లు ఇస్తామన్నారు. జిల్లాలో విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్నాయని, డివిజన్ పరిధిలో రెవెన్యూ పరంగా రూ.1.76 కోట్లు, జిల్లాలో రూ.40 కోట్లు పెండింగ్ బకాయిలు ఉన్నట్లు చెప్పారు. సమీక్షలో ఈఈ మస్తాన్‌రావు పాల్గొన్నారు.